క్లుప్తంగా

డిప్యూటీ సీఎంకు ఆహ్వానం

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో అక్టోబర్ 12న జరగబోయే లాఫ్టర్ యోగ జాతీయ సదస్సుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ముఖ్య అతిథిగా ఆహ్వానించినట్లు శుక్రవారం తెలంగాణ యోగ సంఘ రాష్ట్ర అధ్యక్ష సేవక్ లాఫ్టర్ యోగ జాతీయ చైర్మన్ మరికంటి వెంకట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 2026 లాఫ్టర్ యోగ క్యాలెండర్ లాఫ్టర్ ఇస్ ద బెస్ట్ టేస్ట్ మెడిసిన్ పుస్తకావిష్కరణ, జాతీయ లాఫ్టర్ యోగ ఉచిత సాధన కేంద్రం వెలుగుమట్ల అర్బన్ ఫారెస్ట్ ఖమ్మం కేంద్రం లోగో ఆవిష్కరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కూతురు కృష్ణమూర్తి, రాము పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా 'ఆరెం'


ఆరెం రవి

కామేపల్లి:మోడ్రన్ కబడ్డీ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జిల్లా అధ్యక్షుడిగా కెప్టెన్‌బంజర గ్రామానికి చెందిన ఆరెం రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసం రంగారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుంభం రామిరెడ్డి శుక్రవారం వారికి నియామక పత్రాలు అందించారు.

కేజీబీవీలో ముందస్తు బతుకమ్మ సంబరాలు

కామేపల్లి: మండలంలోని పాతలింగాల కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం ముందస్తుగా బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. విద్యార్థులు బతుకమ్మలను పూలతో పేర్చి ఆటపాటలతో సందడి చేశారు.

ఘనంగా బొడ్డెమ్మ వేడుకలు


బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు

ఖమ్మం గాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్ పరిధిలోని పంపింగ్ వెల్ రోడ్డులోని ఫిల్టర్ బెడ్ వద్ద శుక్రవారం బొడ్డెమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణలో బతుకమ్మ పండుగకు ముందుగా నిర్వహించే ఈ వేడుకలో స్థానిక మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వైద్యాధికారికి తీవ్రగాయాలు

నేలకొండపల్లి: నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న వైద్యాధికారి రాగసుధ శుక్రవారం ఆస్పత్రి ఆవరణలో నడుస్తూ ప్రమాదవశాత్తు జారి పడ్డారు. దీంతో ఆమె కాలు విరగగా.. స్థానిక వైద్యులు ప్రథమ చికిత్స చేసి ఖమ్మం తరలించారు. ఆస్పత్రి ఆవరణం బురదమయంగా మారడంతో కిందపడినట్లు సమాచారం

ఉపాధ్యాయుడికి సన్మానం

తిరుమలాయపాలెం: ఇస్లావత్‌తండా యూపీఎస్ పాఠశాలలో ఎస్జీటీగా పనిచేసి ఖమ్మం అర్బన్ మండలం చిన్నగోపతి ప్రాథమికోన్నత పాఠశాలకు బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు టి.హుస్సేన్‌ను శుక్రవారం ఇస్లావత్‌తండా పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శామా, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఆనందరావు, యాస్మిన్, రవి, భద్రు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న కళా సిల్క్


కళా ప్రదర్శనలో చేనేత వస్త్రాల విక్రయాలు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో హైదరాబాద్‌కు చెందిన కళా సిల్క్ చేనేత హస్తకళా వస్తు ప్రదర్శన మహిళలను ఆకట్టుకుంటోంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కళం బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్లు, లక్నో చికాన్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యూవెలరీ వంటివి అందుబాటులో ఉంచి విక్రయిస్తున్నట్లు నిర్వాహకుడు వినోద్‌జైన్ తెలిపారు. దేశ వ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేత ఉత్పత్తులను 70 పైగా స్టాళ్లలో విక్రయిస్తున్నామన్నారు.

సంతకాల సేకరణ

నేలకొండపల్లి: ఓట్ చోరీపై రాహుల్‌గాంధీ చేపట్టిన ఉద్యమానికి తోడుగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యాన శుక్రవారం నేలకొండపల్లిలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజిని మాట్లాడుతూ.. దొంగ హామీలు, దొంగ ఓట్లతో గద్దెనెక్కిన మోదీ యువతను మోసం చేస్తున్నారని ఆరోపించారు. మోదీ, ఎన్నికల సంఘం కుమ్మకై దేశ ప్రజల ఓట్లను దొంగిలించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యడవల్లి నాగరాజు, మర్రి శివ, కడియాల నరేష్, కొడిరెక్కల వినోద్, కాసాని సతీష్, గాయత్రి, పిట్టల సాయి, దేశబోయిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఐదేళ్లు..

నెలకు కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చే ఎక్సైజ్ శాఖకు సొంత భవనం కరువైంది. గత ఐదేళ్లుగా శిథిలావస్థ భవనంలోనే పాలన కొనసాగిస్తుండగా.. భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అయినా ఏళ్ల తరబడి నిర్మాణ పనులు పూర్తికాక అధికారులు అవస్థలు పడుతున్నారు. పనులు నత్తనడకన సాగుతుండడంతో పిచ్చిచెట్లు పెరిగి అధ్వానంగా దర్శనమిస్తుంది. ఇంకా ప్రభుత్వం ఆ భవనాన్ని ప్రారంభించకుండా.. వేలాది రూపాయలు అద్దె చెల్లిస్తూ భయం గుప్పిట్లో పాలన సాగిస్తున్నారు. అసంపూర్తి భవనాన్ని స్వాధీనం చేసుకునేదిలేదని సంబంధిత అధికారులు లిఖిత పూర్వకంగా జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు.


నేలకొండపల్లిలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఎక్సైజ్ కార్యాలయం

ఇంకా అద్దె భవనంలో ఎక్సైజ్ శాఖ పాలన

- ఆగిన భవన నిర్మాణ పనులు
- పిచ్చిమొక్కల మధ్య దర్శనం
- నాణ్యత లోపించిందని ఆరోపణలు

నేలకొండపల్లి: ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం, మధిర నియోజకవర్గం ఉమ్మడిగా ఉన్న ఎక్సైజ్ శాఖ సర్కిల్ కార్యాలయం నేలకొండపల్లిలో ఉంది. ముదిగొండ, నేలకొండపల్లి, కూసుమంచి మండలాలలో మొత్తం 15 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి నెలా దాదాపు రూ.12 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు చేపడుతూ ప్రభుత్వానికి ఆదాయం సమకూరుస్తున్నారు. అదే విధంగా సర్కిల్‌లో 48 కల్లు సొసైటీలు ఉన్నాయి. వీటి పర్యవేక్షణ కోసం మొత్తం ఒక సీఐ, ముగ్గురు ఎస్సైలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, 10 మంది కానిస్టేబుళ్లు ఉండాల్సి ఉండగా.. సిబ్బంది కొరత కూడా వేధిస్తోంది.

నాణ్యత లోపంపై ఫిర్యాదులు..

అసలే అసంతృప్తి నిర్మాణం..పైగా నాణ్యత లోపించిందని భవనం నిర్మాణంపై స్థానికులు, వివిధ పార్టీలు, ప్రజాసంఘాల ప్రతినిధులు జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేశారు. భవనం ప్రారంభించకుండానే పగుళ్లు ఏర్పడ్డాయని ఆరోపించారు. నాణ్యతపై సమగ్ర విచారణ జరిపించి వెంటనే భవనం నిర్మాణం పూర్తి చేయాలని, ఎక్సైజ్ శాఖ స్వాధీనం చేసుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఐదేళ్లుగా నిర్మాణం...

నేలకొండపల్లిలో ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని నిర్మించేందుకు ఐదేళ్ల క్రితం భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. కానీ వివిధ కారణాలతో సదరు కాంట్రాక్టర్ నేటి వరకూ పూర్తి చేయకుండా పనులను అసంపూర్తిగా నిలిపివేశారు. కనీసం విద్యుత్ సౌకర్యం కూడా కల్పించలేదు. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఈనేపథ్యాన భవనాన్ని స్వాధీనం చేసుకోవాలని జిల్లా అధికారులు సూచించడంతో స్థానిక ఎక్సైజ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎలాంటి సౌకర్యాలు లేవు.. అసంపూర్తిగా ఉందని తాము తీసుకోలేమని స్థానిక సీఐ జిల్లా ఈఎస్‌కు రిపోర్టు చేశారు. దీంతో ఆ భవనం ప్రస్తుతం పిచ్చిచెట్ల మధ్య వృథాగా వదిలేశారు. ఇక ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న అద్దె రేకుల షెడ్‌లో సర్కిల్ కార్యాలయం నడుస్తోంది.

త్వరగా పూర్తిచేయాలి



ఐదేళ్లుగా భవనం నిర్మాణం కొనసాగుతోంది. ఇంకా ఎన్నాళ్లు పడుతుందో తెలియ దు. కారణాలు ఏవైనా నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలి. ఎక్సైజ్ శాఖ అధికారులు చొరవ తీసుకుని నాణ్యత లోపంపై సమగ్ర విచారణ జరిపించాలి.
– కే.వీ.రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి

అంతా పూర్తయ్యాకే..



భవనాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాం. కానీ నిర్మాణం అసంపూర్తిగా ఉంది. సంపూర్ణంగా పూర్తి చేయకుంటే తీసుకోలేమని జిల్లా అధికారులకు నివేదించాం. కనీసం విద్యుత్ సౌకర్యం కూడా లేదు. అంతా పూర్తయ్యే వరకు స్వాధీనం చేసుకోలేము.
– జగన్నాథరావు, ఎక్సైజ్ సీఐ


పిచ్చి చెట్ల మధ్య అంసపూర్తిగా ఉన్న భవనం

బందోబస్తు నడుమ యూరియా పంపిణీ


మంచుకొండ సహకార సంఘంలో యూరియా పంపిణీ చేస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్,రఘునాథపాలెం: ఖమ్మం నియోజకవర్గంలోని సహకార సంఘాల ద్వారా రైతులకు శుక్రవారం యూరియా (ఎరువుల) పంపిణీ చేశారు. ఆయా గ్రామాల పరిధిలో రైతులు పట్టాదారు పాస్‌పుస్తకాల ఆధారంగా ఎకరాల మేరకు ఒక్కటి, రెండు బస్తాల చొప్పున అందించామని సంఘాల సీఈఓలు తెలిపారు. పంపిణీ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నడుమ ఏఈఓలు వ్యవసాయ పట్టా పుస్తకాలు పరిశీలించిన మేరకు ఎరువులను అందించమన్నారు. రఘునాథపాలెం మండలంలోని ఈర్లపూడిలో 335 కట్టలు, మంచుకొండలో 110 కట్టలు పంపిణీ చేయగా, చిమ్మపూడి గ్రామంలో శనివారం మరో 335 కట్టలను పంపిణీ చేయనున్నట్టు మంచుకొండ సొసైటీ సీఈఓ శ్రీనివాసరావు తెలిపారు. రఘునాథపాలెం సొసైటీలో 225 యూరియా కట్టలు పంపిణీ చేసినట్టు ఆ సొసైటీ సీఈఓమద్దినేని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వీ.వీ.పాలెం సొసైటీ పరిధిలోని అల్లీపురంలో 335 యూరియా కట్టలను పంపిణీ చేసినట్టు ఆ సొసైటీ సీఈఓ అయితగాని తిరుపతిరావు చెప్పగా.. చింత గుర్తిలో పంపిణీ చేస్తామన్నారు. రైతులు క్యూలైన్లలో నిలబడి కూపన్లవారీగా ఎరువులు అందుకున్నారని, పోలీసు బందోబస్తు మధ్య పంపిణీ ప్రశాంతంగా జరిగిందని పేర్కొన్నారు.

నిరాహార దీక్షను జయప్రదం చేయండి

కూసుమంచి/ఖమ్మంమామిళ్లగూడెం: బీసీల రిజర్వేషన్ అమలు కోరుతూ ఈనెల 26న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ చేపట్టే ఆమరణ నిరాహార దీక్షను జయప్రదం చేయాలని సంఘం పాలేరు నియోజకవర్గ అధ్యక్షుడు శీలం రామకృష్ణ, కోరారు. శుక్రవారం నిరాహార దీక్ష పోస్టర్లను ఆయన పాలేరులో ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు దాసరి వెంకన్న, నిమ్మల శ్రీను, బత్తుల నర్సయ్య, చాపల నరేష్, శీలం వెంకన్న, చాపల కృష్ణ, పాలెబోయిన మల్సూర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మం డీసీసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఓబీసీ సెల్ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, నగర ఓబీసీ అధ్యక్షుడు బాణాల లక్ష్మణ్, బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోదేపల్లి కృష్ణమాచారి దీక్ష పోస్టర్లను ఆవిష్కరించి శ్రీనివాస్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మసనం శివరామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకుడు బండారు శ్రీనివాసరావు, బీసీ సంఘం నగర అధ్యక్షుడు గద్దె వెంకటరామయ్య, ఉపాధ్యక్షుడు అమతం మల్లికార్జున్, కార్యదర్శి నాగేశ్వరరావు, నగర మహిళా విభాగం అధ్యక్షురాలు గాజుల శ్రీదేవి, యువజన విభాగం అధ్యక్షులు కూరపాటి సతీష్, సీనియర్ నాయకులు గంగరాజు, వీరభద్రం, ఎం.శివ, గోపి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పువ్వాళ్ల, తదితరులు

నూతన విద్యావిధానాన్ని వెనక్కి తీసుకోవాలి

నేలకొండపల్లి: విద్యారంగాన్ని నష్టం కలిగించేలా ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడం ప్రవీణ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన పాలేరు డివిజన్ మహాసభలో ఆయన మాట్లాడారు. విద్యా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, విద్యాశాఖ మంత్రిని నియమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ బషీరుదీన్, పానుకుల సుధాకర్, కొమ్ము శ్రీను, సాయికుమార్, సరిత, మనీషా, గోపి, అఖిల్, శివ, గాదె వరుణ్‌కుమార్ బొడ్డు మధు తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన మున్సిపల్ ఉద్యోగుల ఫోరమ్


మేయర్‌కు మొక్క అందిస్తున్న టీఎన్జీవోస్, మున్సిపల్ ఫోరమ్ బాధ్యులు


ఖమ్మంమయూరిసెంటర్: టీఎన్జీవోస్‌కు అనుబంధంగా ఏర్పడిన మున్సిపల్ ఉద్యోగుల ఫోరమ్ నూతన కమిటీ శుక్రవారం కేఎంసీలో మేయర్ పునుకొల్లు నీరజను మర్యాపూర్వకంగా కలిశారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాస్ నేతృత్వాన మున్సిపల్ ఉద్యోగుల ఫోరమ్ అధ్యక్షుడు ఐ.సుధాకర్, కార్యదర్శి జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉద్యోగులు కలిసి మున్సిపల్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరించారు. మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగుల పరిపాలన విధుల్లో ఒకరిద్దరి జోక్యం ఎక్కువగా ఉండడంతో మిగిలిన ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, వారిని కట్టడి చేయాలన్నారు. అనంతరం మేయర్ ఫోరమ్ బాధ్యులకు శుభాకాంక్షలు తెలిపి మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో మున్సిపల్ ఉద్యోగులది కీలక పాత్ర అని, దానిని దృష్టిలో పెట్టుకొని పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ రాష్ట్ర కార్యదర్శి జైపాల్, విజయ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్ర రమేష్, జాయింట్ సెక్రటరీ తాళ్లూరి శ్రీకాంత్, మున్సిపల్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బుర్రి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'ఎల్‌ఓసీ' అందజేత


ఎల్‌ఓసీ పత్రాన్ని అందిస్తున్న ఎంపీ

ఖమ్మంమయూరి సెంటర్: తిరుమలాయపాలెం మండల కేంద్రానికి చెందిన కొమ్ము ముత్యయ్య కూతురు అద్వితా నందనకు నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో అత్యవసర శస్త్ర చికిత్స కోసం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సిఫారసుతో సీఎంఆర్ఎఫ్ నుంచి రూ. 2లక్షలకు ఎల్ఓసీ పత్రం మంజూరైంది. శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసం వద్ద బాధిత కుటుంబానికి ఎంపీ ఎల్ఓసీ పత్రాలను అందజేశారు. ఇటీవల బాలిక తల్లిదండ్రులు ఎంపీని కలిసి క్రానియల్ రీమోడలింగ్ ఆపరేషన్ చేయించాల్సి ఉందని, ఆర్థిక తోడ్పాటు అందించాలని విన్నవించగా స్పందించి మంజూరు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శస్త్ర చికిత్స విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

ఎస్‌బీఐటీ విద్యార్థికి చేయూత


చెక్కు అందిస్తున్న ఎస్‌బీఐటీ చైర్మన్ కృష్ణ

ఖమ్మం సహకారనగర్: రోడ్డు ప్రమాదంలో తండ్రిని కోల్పోయిన విద్యార్థి ఈ.వీరభద్ర సుజిత్‌కు ఆర్థికంగా చేయూతనందించినట్లు ఎస్‌బీఐటీ చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. కళాశాలలో విద్యార్థికి రూ.లక్ష చెక్కు అందజేసిన ఆయన మాట్లాడుతూ.. కొద్దినెలల క్రితం జరిగిన ప్రమాదంలో సుజిత్ తండ్రి శంకర్‌రావు మృతి చెందాడని పేర్కొన్నారు. ఈనేపథ్యాన విద్యార్థి చదువుకు ఇబ్బంది కలగకుండా నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా బీమా చెక్కు అందించామన్నారు. కళాశాల డైరెక్టర్లు గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏ.వీ.వీ.శివ ప్రసాద్, జె.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం..

కామేపల్లి: కామేపల్లికి చెందిన గూడచెట్టి ఉమా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. శుక్రవారం ఆమె తోటి స్నేహితులు అందరూ కలిసి రూ.14 వేల నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అజ్మీరా శివ, యనమల రాజు, గంపల రఘు, బుట్టి షాహీన్, జక్కంపూడి సింధు, మేకల కమల పాల్గొన్నారు.

కేజీబీవీ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి

రఘునాథపాలెం/కామేపల్లి: కేజీబీవీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్‌టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ (టీయూసీఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సెప్టెంబర్ 22న జరిగే చలో ఎస్‌పీడీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు ఆవుల అశోక్ పిలుపునిచ్చారు. రఘునాథపాలెం మండల కేజీబీవీ వద్ద శుక్రవారం జరిగిన సమావేశంలో, కామేపల్లి మండలం పాతలింగాల కేజీబీవీ వద్ద ఆయన మాట్లాడుతూ.. వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, చిన్న ఉద్యోగులు పోరాడే సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో నాగలక్ష్మి, రేణుక, శిరీష, మరియమ్మ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వద్దు


మొక్కకు నీరు పడుతున్న ఎంపీడీఓ యర్రయ్య

నేలకొండపల్లి: మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని ఎంపీడీఓ ఎం.యర్రయ్య సూచించారు. మండలంలోని అమ్మగూడెంలో శుక్రవారం అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం లక్ష్యం నెరవేర్చేందుకు బాధ్యతగా పని చేయాలని, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు, పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మౌలిక సౌకర్యాలు కరువు

ఖమ్మం మామిళ్లగూడెం: సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వసతి గృహాలు, గురుకులాల్లో తరచుగా పునరావృతమవుతున్న ఫుడ్‌పాయిజన్ ఘటనలపై జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాలని కోరారు. ఇక విద్య, వైద్య, మున్సిపల్ అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పలు వసతి గృహాలు, గురుకులాలు, కస్తూర్బా విద్యాలయాల్లో కనీసం మంచినీటి సౌకర్యం కూడా లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, దీనిపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి శివ, వంశీ, మనోజ్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

అధిక కరెంట్ బిల్లులు రద్దు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 60వ డివిజన్ ప్రాంతం మల్లెలమడుగు పరిధిలో గల డబుల్ బెడ్రూమ్ నివాస ప్రజలు కరెంటు వినియోగించకపోయినా రూ.వేల కరెంటు బిల్లులు రావడంపై సీపీఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులుడు ఖమ్మం నగర కార్యదర్శి షేక్ జానిమియా తీవ్ర విమర్శలు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఖమ్మంలోని విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదుట సీపీఐ నగర సమితి ఆధ్వర్యాన మల్లెల మడుగు డబుల్ బెడ్రూమ్ నివాసులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూమ్ నివాసంలో ప్రతినెలా రీడింగ్ తీయకుండా ఆరేడు నెలలకోసారి తీస్తున్నారని, అలా కాకుండా ప్రతీ నెల రీడింగ్ తీసేలా చర్యలు చేపట్టాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం, మేకల శ్రీనివాసరావు, కౌన్సిల్ సభ్యులు నానబాల రామకృష్ణ, ఏనుగు గాంధీ, నూనె శశిధర్, సతీష్‌రెడ్డి, డబుల్ బెడ్రూమ్ ప్రెసిడెంట్ బోడా వీరన్న, నాయకులు జాకీర్, కృష్ణమూర్తి, ఉపేందర్, పర్వీన్, తులసి, పూజిత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.


ఆందోళనలో పాల్గొన్న నాయకులు, నివాసితులు

సంక్షిప్త సమాచారం

టీజేఎస్ జిల్లా అడహక్ కమిటీ రద్దు

ఖమ్మం మామిళ్లగూడెం: టీజేఎస్ ఖమ్మం జిల్లా అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎస్.కె సర్దార్ హుస్సేన్ నేతృత్వాన ఉన్న జిల్లా అడహక్ కమిటీని పూర్తిగా రద్దు చేసినట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకరరావు తెలిపారు. శుక్రవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సభ్యత్వాలు, మండల కమిటీలు పూర్తికాకుండా జిల్లాలో ఎలాంటి కమిటీలు నియామకం చేయరాదని, ప్రొఫెసర్, పార్టీ అధినేత కోదండరామ్ సమక్షంలో తీసుకున్న నిర్ణయం మేరకు జిల్లాలో 11 మంది బాధ్యులను సంప్రదించాకే కమిటీలు వేయాలన్నారు. గురువారం ఖమ్మంలో సర్దార్ హుస్సేన్‌తో పాటు మరో వ్యక్తి కలిసి వేసిన కమిటీలు చెల్లవని, కోదండరాం సమక్షంలో పూర్తిస్థాయి కమిటీలు వేయబడుతుందన్నారు. ఈ సమావేశంలో టీజేఎస్ జిల్లా నాయకులు రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

భక్తుల విశ్వాసాన్ని రాజకీయాలతో ముడి పెట్టొద్దు

ఖమ్మంఅర్బన్: శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయంలో నిత్య కైంకర్యాలు, ఆచార వ్యవహారాల్లో రాజకీయ జోక్యం తగదని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ (ఏబీఏపీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు టీ.వీ.పుల్లంరాజు స్పష్టం చేశారు. భక్తుల విశ్వాసాన్ని రాజకీయాలతో ముడిపెట్టొద్దని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన కోరారు. 2018లో సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాత నుంచి అనవసర రాజకీయ జోక్యంతో అయ్యప్ప భక్తులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. దేవాలయం అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కల్పన విషయంలో ప్రభుత్వం, దేవస్థానం బోర్డు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా ఆధ్యాత్మిక సేవా సంస్థలు, ట్రస్ట్ వాటాదారులతో కలిసి చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

సమాచారం..

● **నేడు ధార్మిక సభ**

ఖమ్మం మామిళ్లగూడెం: ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ ఆధ్వర్యాన ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో శనివారం ఇస్లాం ధార్మిక సభ నిర్వహిస్తున్నట్లు మహ్మద్ జవ్వాద్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. మహ్మద్ ప్రవక్త (స.అ.సం) జీవిత సందేశాన్ని గుర్తు చేసుకోవడం, అన్ని రంగాల్లో ముస్లింలు సంఘటితం కావాలన్న అజెండాతో నిర్వహించే ఈ సభ సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమవుతుందని, ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

● **మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా మహాసభ**

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఖమ్మం జిల్లా మూడవ మహాసభలు ఖమ్మంలోని అంబేద్కర్ భవన్‌లో శనివారం నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ మహాసభలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు శింగు నర్సింహారావు, బీ.జీ.క్లైమెంట్, రావి శివరామకృష్ణ తదితరులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

● **విద్యుత్ సరఫరాకు అంతరాయం**

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని రామాలయం 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–1 ఏడీఈ నాగార్జున శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కమాన్‌బజార్, కస్బాబజార్, వల్లాలవారి వీధి, షాదీఖానా, స్టేషన్ రోడ్, బొమ్మ ససెంటర్, శాంతిలాడ్జ్, వినోద థియేటర్ ఏరియా, ఓల్డ్ మున్సిపల్ ఏరియా, ఖిల్లా, శుక్రవారపుపేట, బ్రాహ్మణబజార్, అమ్మభవాని టెంపుల్ ఏరియాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

రేపు తెలంగాణ ఉద్యోగుల సంఘం సమావేశం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఇందిరానగర్‌లోని సంఘం కార్యాలయంలో నెల 21వ తేదీన తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుగులోతు బిక్కు, కాంపాటి వెంకటరమణలు ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్ల స్థలాలు, అర్హత కలిగిన ఉద్యోగులకు పదోన్నతులు, వివిధ అంశాలపై చర్చించబడుతుందన్నారు.

22 నుంచి శరన్నవరాత్రులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని గుట్టలబజార్‌లో ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు 49వ శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కేఎంసీ సమాచారం..

● **పార్కుల్లో మొక్కలు నాటాలి**


పార్కు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజలకు ఆరోగ్యవంతమైన వాతావరణం కల్పించేలా పార్కుల్లో మొక్కలు నాటాలని, అన్ని సౌకర్యాలతో పార్కు నిర్మాణాన్ని పూర్తి చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఉద్యాన, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని 54వ డివిజన్‌లో నూతనంగా నిర్మిస్తున్న పార్క్‌ను కమిషనర్ అధికారులతో కలిసి పరిశీలించారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణాలు, ఓపెన్ జిమ్ సౌకర్యాలు, మొక్కల పెంపకంపై అధికారులకు సూచనలు చేశారు. త్వరతగతిన పార్క్ నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఖానాపురంలో నిర్మిస్తున్న ప్రాథమిక అర్బన్ హెల్త్ సెంటర్‌ను కమిషనర్ పరిశీలించారు.

● **స్వచ్ఛతా హీ సేవాపై అవగాహన**

స్వచ్ఛతా హీ సేవా –2025 కార్యక్రమంలో భాగంగా నగరంలోని పలు పాఠశాలలు, కూడళ్ల వద్ద పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్ పాల్గొని తడి, పొడి వ్యర్థాలు వేరు చేయడం, ప్లాస్టిక్ వినియోగం అరికట్టడంపై చైతన్యపరిచారు.

● **సమయపాలన పాటించాలి..**

శానిటేషన్ విభాగంలో విధులు నిర్వర్తించే జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్మికులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం కేఎంసీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లతో సమావేశం నిర్వహించి, వాకీటాకీల వినియోగంపై పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజూ ఉదయం 5 గంటల కల్లా జవాన్లు డివిజన్లలో రిపోర్ట్ చేయాలన్నారు. ఎవరెవరు ఎంత సేపు పని ప్రాంతంలో ఉన్నారనే అంశాలను ట్రాక్ చేయబడుతుందని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.